- ఉషోదయ కూడలిలో తప్పని ట్రాఫిక్ కష్టాలు
- బస్సులు, భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- రూ.36 లక్షలతో ఇటీవల కూడలి ఆధునికీకరణ
- డివైడర్ల మార్పు చేయకపోవడంతో అవస్థలు
- పట్టించుకోని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు



లాసన్స్ బే వైపు మలుపు తిరిగేందుకు ఇబ్బంది పడుతున్న ప్రైవేట్ బస్సు


ఇటీవల రూ.36 లక్షలతో ఆధునికీకరించిన ఉషోదయ కూడలి

అంతా గందరగోళం


ఎంవీపీ కాలనీ వైపు మలుపు తిరిగేందుకు ఇబ్బందులు ఎదురవడంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 17వ వార్డు పరిధిలోని ఉషోదయ కూడలి భారీ వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించాలంటే ఇటు ఆర్టీసీ డ్రైవర్లు, అటు భారీ ప్రైవేట్ వాహనదారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు స్థానిక వాహనదారులూ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కూడలి మధ్యలోని డివైడర్, విద్యుత్ స్తంభాన్ని అడ్డదిడ్డంగా వదిలేయడమే ఇందుకు కారణమని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ 17, 19 వార్డులకు సరిహద్దులో ఉషోదయ కూడలి ఉండగా కొన్ని నెలల క్రితమే పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. అయితే ఆ సమయంలో ప్రణాళికబద్ధంగా వ్యవహరించకపోవడం, డివైడర్లను తొలగించకపోవడంతో భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఇప్పటికైనా సమస్య పరిష్కరించి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను వాహనదారులు కోరుతున్నారు.

అడ్డదిడ్డంగా డివైడర్, విద్యుత్ స్తంభం

కొన్ని నెలల క్రితం జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూ.36 లక్షలతో ఉషోదయ కూడలిని ఆధునికీకరించారు సర్కిల్‌లో ఐలాండ్ ఏర్పాటుతో పాటు వాటర్ ఫౌంటెయిన్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. దీంతోపాటు సర్కిల్‌ను ఆనుకుని రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్ నిర్మాణం, రోడ్డు నిర్మాణం కూడా చేపట్టారు. అయితే గతంలోని రోడ్డు మార్గానికి అనుగుణంగా ఉన్న డివైడర్లను ఎక్కడివి అక్కడే వదిలేశారు. దీంతో ఆధునికీకరణ పనులు కారణంగా నాలుగు వైపులా రోడ్డు విస్తరణ జరిగినప్పటికీ డివైడర్లను మార్పు చేయకపోవడంతో బస్సులు, భారీ వాహనాలు కూడలిలో మలుపు తిరిగేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంవీపీ కాలనీ నుంచి వచ్చే బస్సులు, భారీ వాహనాలు ఉషోదయ కూడలి నుంచి లాసన్స్ బే కాలనీ వైపు తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఒక్కసారి మలుపు తిరిగే సమయంలో ఇబ్బందులు తలెత్తి నిలిచి పోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్సులు సైతం ఒక్కోసారి మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఫలితంగా ఆ సమయంలో ఇతర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు విలువైన సమయం వృథా చేసుకోవాల్సి వస్తోంది. కూడలి విశాలంగా ఉన్నప్పటికీ ఆధునికీకరణకు అనుగుణంగా డివైడర్లను మార్పు చేయకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం స్పందించి కూడలిలో రాకపోకలకు అడ్డంగా ఉన్న డివైడర్లు, విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని పలువురు కోరుతున్నారు. అయితే దీనిపై స్థానిక ఇంజినీరింగ్ విభాగం ఏఈ అప్పలనాయుడు వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇటీవల తాను విధుల్లో చేరిన నేపథ్యంలో అక్కడి సమస్య తన దృష్టికి రావాలేదన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మార్పులు చేస్తామని వెల్లడించారు.


సమస్యకు కారణమవుతున్న డివైడర్, భారీ విద్యుత్ స్తంభం

జూ పార్కుకు ప్రత్యేక ముస్తాబు


జూలో రోడ్డు పక్కన రంగులు వేసిన దృశ్యం

ఆరిలోవ : జూ పార్కును అధికారులు సంక్రాంతికి ముస్తాబు చేస్తున్నారు. సందర్శకులను ఆకట్టుకునేలా రంగులతో సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా జూ లోపల రోడ్లకు ఇరుపక్కలా అడుగు ఎత్తులో ఉండే గోడలకు మరమ్మతులు చేపడుతున్నారు. పోయినచోట్ల మరమ్మతులు చేసి వాటికి రంగులు వేస్తున్నారు. దీంతో జూ పార్కుకు కొత్తదనం వస్తోంది.

ఆదాయపు పన్ను మినహాయింపు కోరుతూ వినతి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న అధ్యాపకులు

విశాఖ విద్య : ఆంధ్రా యూనివర్సిటీ అతిథి అధ్యాపకులకు ఆదాయపు పన్ను మినహాయించాలని కోరుతూ వర్సిటీ అతిథి అధ్యాపకులంతా గురువారం రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు వినతి పత్రం అందజేశారు. పన్ను పరిధి నుంచి మినహాయించేందుకు యూనివర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు తెలిపారు. రానున్న రోజుల్లో అతిథి అధ్యాపకులు అందరికీ నెల వారీ జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సురేష్ మీనన్, ప్రసాద్, దేవ, శిరీష్, సురేంద్ర, విక్రమ్, మృత్యుంజయ, శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్రాంతి సెలవులు అమలు చేయాల్సిందే

విశాఖ విద్య : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు పక్కాగా అమలు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే సెలవులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు గురువారం తెలిపారు. ఈ సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నట్లు ఆధారాలతోపాటు తమ కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఏ యాజమాన్యానికీ మినహాయింపులు లేవన్నారు. అటువంటి పాఠశాలలపై ఆయా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆధారాలతో ఫిర్యాదులు అందితే చట్ట ప్రకారం చర్యలకు సిఫారసులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

బీసీ కుల గణన చేపట్టాలి


మాట్లాడుతున్న శంకరరావు

విశాఖ విద్య : బీసీ కులగణన వెంటనే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కోరారు. యూనివర్సిటీలోని ఎస్ఎస్ఎస్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్ట సభల్లో సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాధాన్యత లేదన్నారు. ప్రభుత్వాలు మారినా బీసీల తలరాతలు మారలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల సమగ్ర వికాసానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడిగా చంద్రబోస్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు. అనంతరం పలువురు బీసీ వర్గాల మేధావులతో భవిష్యత్ కార్యక్రమాలపై సమీక్షించారు.

ఉత్తమ విలువలతోనే విద్యార్థుల ఉన్నతి

- కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్
- ఘనంగా విశాఖ వ్యాలీ వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు : విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రమశిక్షణ, విలువలు పెంపొందించాలని కలెక్టర్, విశాఖ వ్యాలీ చైర్మన్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అన్నారు. అభివ్యక్తి పేరుతో విశాఖ వ్యాలీ వార్షిక వేడుకలను గురువారం గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలోని అన్ని రంగాల్లో విజయం సాధించేందుకు, ప్రతిభ కనబరిచేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం స్కూల్ వార్షిక నివేదిక, పాఠశాల మ్యాగజైన్ విడుదల చేశారు. విశేషాంశంగా విద్యార్థుల అత్యుత్తమ విజయాలను గుర్తిస్తూ బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. 'ఒడిస్సీ టు ది మూన్', ఎ'పంచతత్వం-ది ఫైవ్ ఎలిమెంట్స్'వంటి ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్‌కు నివాళి


సంతపాలెం పాఠశాలలో ఫాతిమా షేక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో ఫాతిమా షేక్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఫాతిమా షేక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మట్లాడుతూ ఫాతిమా దేశంలో మహిళా విద్య కోసం కృషి చేసిన మొదటితరం మహిళ అని కొనియాడారు. జ్యోతీరావు పూలే వద్ద ఆమె విద్యాభ్యాసం చేశారన్నారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

శ్రీవారి ఆలయానికి భారీగా వెండి ఆభరణాలు


వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తుల కోసం వెండి ఆభరణాలు అందిస్తున్న భక్తులు


పద్మావతి అమ్మవారికి తయారు చేయించిన వెండి చీర అందజేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి స్థానిక భక్తులు భారీగా వెండి ఆభరణాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు 8 కేజీల వెండితో తయారు చేయించిన సర్వాంగ కవచాలు సమర్పించారు. దీంతోపాటు శ్రీ పద్మావతి అమ్మవారికి 5 కేజీల వెండితో అద్భుతంగా తయారు చేయించిన చీర, పాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త ప్రసాదరావు, అర్చకులు లక్ష్మణస్వాములకు ఈ ఆభరణాలను భక్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు గౌరీశంకర్, లక్ష్మీనారాయణ, జగన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ఆరు నెలలకోసారి రక్తదానంతో ఆరోగ్యానికి మేలు


విమ్స్ రక్తదాన శిబిరంలో దాతలు, డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తదితరులు

ఆరిలోవ : రక్తదానం ప్రాణాలను కాపాడుతుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విమ్స్ సిబ్బంది రక్తం అందించడానికి ముందుకొచ్చారు. ఇక్కడ ఇటీవల బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి వచ్చింది. అందులో నిల్వ చేయడానికి అవసరమైన రక్తం కోసం విమ్స్ అధికారులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ రాంబాబు రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరానికి రక్తం లభ్యం కాకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి ఆరు నెలలకు ఓసారి రక్తదానం చేయవచ్చన్నారు. దానివల్ల శరీరానికి మేలు జరుగుతుందన్నారు. కొత్త రక్తం చేరి శరీరంలో ఉత్తేజం కలుగుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడంతోపాటు రక్తం ఇచ్చిన వారు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విమ్స్ కార్యాలయం పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, పరిపాలనాధికారి షేక్ బాజీ, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై సీపీఎం నిరసన


మద్దిలపాలెం బస్ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: ప్రధాని మోదీ బహిరంగ సభలో స్టీల్ ప్లాంట్‌పై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని నిరసన తెలియజేసిన సీపీఎం, సీపీఐ, వామపక్ష పార్టీల నాయకులను ఈనెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. అక్రమ అరెస్టులకు నిరసనగా గురువారం పీఠాపురంకాలనీ నుంచి మద్దిలపాలెం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మద్దిలపాలెం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్, కృష్ణారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోదీ నోరు మెదకపోవడం శోచనీయమన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోదీ భజన చేశారు తప్ప స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించే విధంగా ఒత్తిడి తీసుకురాలేదన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇంకా ఏర్పాటు కాని ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం సొంత గనులు కేటాయించాలని అడగడం సిగ్గు చేటన్నారు. మోదీ, బాబు, పవన్ స్టీల్‌ప్లాంట్‌పై యూటర్న్ తీసుకున్నట్లయితే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయన్నారు. ప్లాంట్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోయినా ఉత్పత్తిని పెంచుతున్నారని గుర్తు చేశారు. తక్షణమే ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, చలపతి, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి వైజ్ఞానిక ప్రదర్శన

మహారాణిపేట : ప్రముఖ విద్యా సంస్థ గాయిత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలల్లో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు రెండు రోజుల పాటు విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు గాయిత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి తెలిపారు. ఈ ప్రదర్శనలో ఆధునిక వైద్య, విద్య, విజ్ఞాన శాస్త్రం, భాష, సంస్కృతి, సంప్రదాయాలపై బాలలకు విజ్ఞానం పెంపొందించడానికి ప్రదర్శన దోహదపడుతుందని తెలిపారు. ప్రదర్శన కోసం 200 నమూనాలు ప్రిన్సిపల్ కె.మధురవాణి సిద్ధం చేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు


కైలాసగిరి పోలీస్ మైదానంలో అభ్యర్థులకు సూచనలిస్తున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ : కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపడుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఎనిమిదో రోజు శరీర దారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 600 మందికి 304 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 237 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించినట్లు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ పరీక్షలను ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజినల్ డీఎస్పీ ఎం.శ్రావణి, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వర రావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ ఇన్‌స్పెక్టర్ టి.కళ్యాణి, ఆర్ఐ రామకృష్ణ, ఎస్ఐ సురేష్‌బాబు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల పరిహారం

మద్దిలపాలెం: రోడ్డు ప్రమాద బాధితులు ముగ్గురికి రూ.1.50 లక్షలు పరిహారం అందించారు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సహాయ కేంద్రం తీసుకున్న చర్యల ఫలితంగా ఇటీవల హిట్ – రన్ ప్రమాదాల్లో తీవ్ర గాయాల పాలైన మురళీనగర్‌కు చెందిన వాసుదేవ్ ప్రజాపతికి అలాగే అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన పోలిశెట్టి వెంకట నాగ మాధవి, మర్రిపాలేనికి చెందిన కోన శంకరరావుకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున ముగ్గురికి వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేశారు.

ఎంత ఎత్తయినా నాకెంత..


చెట్ల కొమ్మలను అందుకుంటున్న ఏనుగు సరస్వతి


షెల్టర్ పైకప్పు అందుకోవడానికి ప్రయత్నిస్తూ..

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో గురువారం సరస్వతి అనే ఆడ ఏనుగు సందర్శకులను అలరించింది. ఎన్‌క్లోజర్‌లో హుషారుగా ఆటలాడుతూ సందర్శకులకు కనువిందు చేసింది. ఎన్‌క్లోజర్‌లో ఉన్న చెట్ల వద్దకు వెళ్లి కొమ్మలను ముందర కాళ్లతో అందుకుని ఆహారంగా తీసుకొంది. తాటి కమ్మల షెల్టర్ పైకప్పును సైతం విడిచిపెట్టలేదు. పర్యాటకులు దాని ఫీట్లు చూసి ఎంజాయ్ చేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు


బ్యానర్లు పట్టుకుని ర్యాలీ నిర్వహిస్తున్న శానిటరీ, సచివాలయ సిబ్బంది

ఆరిలోవ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నమ్మి బంగార్రాజు హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై జీవీఎంసీ 11వ వార్డులో గురువారం అవగాహన కల్పించారు. శానిటరీ, సచివాలయాల సిబ్బంది బ్యానర్లు పట్టుకుని వీధుల్లో ర్యాలీ చేపట్టారు. పార్వతీనగర్, అంబేడ్కర్ కూడలి, పాత ఆరిలోవ, బాలాజీనగర్, అన్నానగర్ వరకు కిరాణా షాపులు, టిఫిన్ దుకాణాలు, బడ్డీల వ్యాపారుల వద్దకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించొద్దని, విక్రయించొద్దని సూచించారు. ఎవరైనా నిషేధాన్ని అతిక్రమించి వినియోగించినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణకు, ఎకో వైజాగ్ అభివృద్ధికి అంతా సహకరించాలని కోరారు. ఈ నెల 1 నుంచి ప్లాస్టిక్ నిషేధానికి కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వారి ఆదేశాలు ప్రకారం నిషేధం అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



రంగోళీ ప్రదర్శిస్తున్న జేకే స్కూల్ విద్యార్థులు



అల్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 7లోని జేకే పబ్లిక్ స్కూల్, సెక్టార్ – 10లోని అల్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. రంగురంగుల రంగోలీలతో పాఠశాల ఆవరణలు తీర్చిదిద్దారు. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేలా వివిధ రకాల బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జేకే స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్‌వీ విజయకుమార్, ఉపాధ్యాయులతో పాటు అల్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యాదాస్, ప్రిన్సిపాల్ సుశీల పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలో వచ్చిన పిల్లలు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. చిన్నారులు ఆటపాటలతో సరదాగా గడిపారు. పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీలు, గోరింటాకు పెట్టడం, బుడబుక్కలు వేషాలు, కోలాటం, హరిదాసు పాటలు, కొమ్మరిదాసు కీర్తనలు, తల్లికి వందనం, చిన్నారులకు భోగిపళ్లు పోయడం తదితర కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. బీవీకే కార్యదర్శులు రమా సత్యనారాయణ, బి.నారాయణరావు, పాఠశాల కరస్పాండెంట్ నర్సింహ నాయుడు, ప్రచార కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్ : బీచ్‌రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎం.ఎల్.బి.టి. పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రంగవల్లులు, గొబ్బెమ్మల సోయగాలు, సంక్రాంతికి స్వాగతం పలుకుతూ వేసిన భోగి మంటలు తెలుగు సంతస్కృతికి ప్రతిబింబంగా నిలిచాయి. సంక్రాంతి పండగకు స్వాగతం పలుకుతూ పాఠశాల ప్రాంగణాన్ని మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. విద్యార్థులు రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్ది తమ ప్రతిభ చూపారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీవీకే పాఠశాలలో భోగి మంట వేస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు


గాయిత్రి ఎంఎల్‌బీటీ పాఠశాలలో భోగి వేడుకల్లో ఉపాధ్యాయులు